# పరిచయము

నూతన నిబంధనలో ఉన్న ఇరవై యేడు పుస్తకములలో, పదమూడు పుస్తకములు పౌలు యొక్క పేరును కలిగియున్నాయి. వీటిలో నాలుగు పత్రికలు (1 తిమోతి; 2 తిమోతి; తీతుకు; మరియు ఫిలేమోనుకు) వ్యక్తులకు వ్రాయబడ్డాయి. తొమ్మిది పత్రికలు బాల్యంలో ఉన్న సంఘములకు వ్రాయబడ్డాయి, ఈ సంఘములలో అధికమైనవి పౌలు తన సువార్త ప్రయాణములో ఉన్నప్పుడు స్థాపితము చేయబడ్డాయి. ఈ సంఘములలో సభ్యులుగా ఉన్నవారు క్రైస్తవులు అయినప్పటికీ, వారు ఇటీవలె విగ్రహారాధన నుండి వెలుపలికి వచ్చినవారు. కాబట్టి వారి మార్పునకు మునుపు వారు పొందిన ఉపదేశముల కంటే ఇప్పుడే వారికి మరి యెక్కువ ఉపదేశము అవసరమైయున్నవి. ఈ పత్రికల ద్వారానే పౌలు పరిశుద్ధాత్మ ప్రేరేపితుడై (1 కొరింథీ. 14:37) అటువంటి లోతైన ఉపదేశాన్ని అందించాడు.

పౌలు ద్వారా స్థాపించబడిన సగటు సంఘములన్నిటితో పోలిస్తే థెస్సలొనీక సంఘమువారు మరెక్కువ ఉపదేశము యొక్క అవసరత కలిగినవారిగా ఉన్నారు. ఎదుగుతున్న క్రైస్తవ ఉద్యమాన్ని వ్యతిరేకిస్తున్న యూదుల ద్వారా పురికొల్పబడిన హింసాకాండ కారణంగా, అనుకున్న దానికంటే ముందుగానే ఆయన పట్టణమును విడువవలసి వచ్చింది (అపొ. 17:1-10). థెస్సలొనీకయులను క్రైస్తవ ఎదుగుదలకు అవసరమైన బోధలను వారికి అందించుటకు పౌలు ఈ రెండు పత్రికలను వారికి వ్రాసాడు.

## రచయిత

### అంతర్గత రుజువు

థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక పౌలుచే వ్రాయబడినట్లుగా వాక్యము నిర్ధారిస్తుంది (1:1; 2:18). వేరే చోట పౌలు ప్రయోగించిన పరిభాషకు ఈ వాక్యము అనుకూలంగా పోలుస్తుంది. (ఉదాహరణకు, 1:2 వచనము రోమా. 1:8తో పోల్చబడటం, మరియు 4:1 వచనము ఎఫెసీ. 6:10 మరియు ఫిలిప్పీ. 4:8తో పోల్చబడటం చూడండి.)

సీల యొక్క పేరును గూర్చి ఇతర ఆధారాల నుండి మనకు ఏమి సమాచారమైతే ఉన్నదో ఇక్కడ కూడా అదే వర్తించేదిగా ఉంది (అపొ. 17:4). థెస్సలొనీక సంఘమును

స్థాపించుటకుగాను ఆయన పౌలుకు సహాయము చేసాడు. తిమోతిని గూర్చి అపొస్తలుల కార్యములు మరియు క్రొత్తనిబంధన గ్రంథములలో ఇతర ప్రదేశాలలో ఏమైతే చెప్పబడినదో ఈ పత్రికలో కూడా అదే వర్తించేదిగా ఉంది (1:1పై గల చర్చను చూడండి).

### బాహ్య రుజువు

ప్రేరేపితముకాని ఇతర మూలములను పరిశీలిస్తే కూడా పౌలే ఈ పత్రికకు రచయితగా తెలుస్తున్నాడు.

ఉదాహరణకు, క్రీ.శ. 95లో, రోమాకు చెందినా క్లెమెంట్ అనే చరిత్రకారుడు వ్రాస్తూ, "మనము అన్ని విషయములలో కూడా ఆయనకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించవలసినవారముగా ఉన్నాము"[1] అని అన్నాడు. ఈ మాట 1 థెస్సలొనీకయులకు 5:18కు సమాన వాక్యంగా ఉంది. క్రీ.శ. 110లో అంతియొకయకు చెందిన ఇగ్నేషియస్ వ్రాస్తూ, "మీరు కూడా ఎడతెగక ప్రార్థన చేయుడి" అని అన్నాడు, మరియు ఈయన యొక్క హెచ్చరిక బహుశా 1 థెస్సలొనీకయులకు 5:17 నుండి గ్రహించబడినట్లుగా తెలుస్తుంది.[2] సుమారు క్రీ.శ. 140 సంవత్సరమునకు చెందిన ప్రేరేపిత పుస్తకముల సంకలనములను కలిగిన Marcion's canonలో 1 థెస్సలొనీకయులకు పత్రికను కలిగియుండి దానిని పౌలుకు ఆరోపించింది. దరిదాపుగా క్రీ.శ. 170 సంవత్సరమునకు చెందిన Roman canonలోని Muratorian Fragmentలో కూడా 1 థెస్సలొనీకయులకు పత్రిక ఉంది. క్రీ.శ. 180లో Irenaeus అనే వ్యక్తి తన స్వీయరచనయైన *Against Heresies* అనే పుస్తకములో ఈ పత్రికను ప్రస్తావించాడు.

క్రీ.శ. 200 మొదలు చాలా మంది థెస్సలొనీకయులకు వ్రాసిన ఈ మొదటి పత్రికను పలుచోట్ల ప్రస్తావించి దీనిని పౌలు వ్రాసినట్లుగా చెప్పారు. ఈ విధంగా చాలా తక్కువ మంది ఈ పత్రిక పౌలుకు చెందినది అనే విషయాన్ని వ్యతిరేకించారు గనుక ఇది ప్రేరేపితమైనదే.

## రచయిత యొక్క నేపథ్యము

### ఆయన యొక్క జననము

కిలికియలోని తార్సులో పౌలు జన్మించాడు (అపొ. 21:39; 11:25), ఇది అనేకమంది యూదులు నివసించే ఒక వాణిజ్యపరమైన పట్టణము. ఈ పట్టణములో ఎప్పుడూ అలెక్సాండ్రియా, ఐగుప్తు వంటి పట్టణములలోని గ్రంథాలయాలతో పోటీపడే ఒక ప్రసిద్ధమైన గ్రంథాలయము ఉండేది. ఈ పట్టణపు పౌరులలో ప్రసిద్ధమైనవాడు Athenodosius, ఈయన చక్రవర్తియైన Octavian Augustus యొక్క స్నేహితుడు.

పౌలు యొక్క జనన సంవత్సరము బహుశా క్రీ.శ. 1-10 సంవత్సరముల వ్యవధిలో జరిగి ఉంటుంది. సుమారు క్రీ.శ. 34-35 మధ్య స్తెఫను రాళ్లతో చంపబడినప్పుడు, లూకా ద్వారా పౌలు ఒక యౌవనస్థుడిగా పేర్కొనబడ్డాడు (అపొ. 7:58). బహుశా క్రీ.శ. 62-63 మధ్య ఫిలేమోను పత్రిక వ్రాయబడినప్పుడు, ఆయన తనను తాను "వృద్ధుని"గా సంబోధించుకున్నాడు (ఫిలే. 9).

## ఆయన కుటుంబము

తన కుటుంబమును గూర్చి మాట్లాడితే, ఆయన బెన్యామీను గోత్రమునకు చెందిన ఒక యూదుడు (ఫిలిప్పీ. 3:5-8). హెబ్రీ భాషలో ఆయన సౌలుగా పిలువబడేవాడు; గ్రీకు భాషలో పౌలుగా పిలువబడేవాడు (అపొ. 13:9). ఆయన యొక్క తండ్రి రోమా పౌరుడు (అపొ. 22:25-29). ఆయన యొక్క కుటుంబము చాలా సంపన్నులై ఉండి ఉంటుంది; లేకపోతే, వారు చదువు నిమిత్తము పౌలును యెరూషలేము పంపేవారు కారు (అపొ. 22:3).

## ఆయన యొక్క విద్య

సాధారణమైన యూదా కుటుంబములలో, మగవారందరూ తమ ఐదవ యేటనే పాతనిబంధనను చదవడం ప్రారంభిస్తారు. తార్సులో ఉన్న గ్రీకు పాఠశాలలకు ఆయన వెళ్లి ఉంటాడు. క్రొత్తనిబంధనలోని వాక్యములను చూస్తే, గ్రీకు రచయితలతో ఆయనకు కొంత పరిచయము ఉన్నట్లుగా తెలుస్తుంది. అపొస్తలుల కార్యములు 17:28లో, ఆయన క్రీ.పూ. 650లో మరణించిన క్రేతు ప్రవక్తయైన Epimenidesను ప్రస్తావించాడు. 1 కొరింథీ. 15:33లో ఆయన క్రీ.పూ. 300లో మరణించిన గ్రీకు రంగస్థల నటుడైన Menanderను ప్రస్తావించాడు.

పౌలు యౌవనస్థునిగా ఉన్నప్పుడు ఆయన రబ్బీయైన గమలీయేలు క్రింద చదువుకొనుటకు పంపబడ్డాడు (అపొ. 22:3; 5:34).[4] ఆయన తన చదువులో పురోగతి చెంది యూదా ఆచారముల పట్ల ఆసక్తిగలవాడయ్యాడు (గలతీ. 1:11-14). పాలస్తీనాలో ఆయన అరమీ భాష మాట్లాడి ఉంటాడు; అంటే పౌలు హెబ్రీ, గ్రీకు మరియు అరమీ భాషలలో మాట్లాడగలవాడని అర్థము.

పౌలు యొక్క కాలములో ఒక విద్యార్థికి బోధించేటప్పుడు ఆయనకు ఒక "నైపుణ్యాన్ని" అందించడం ఒక వాడుకగా ఉండేది.[5] పౌలు డేరాలు కుట్టడం నేర్చుకున్నాడు ఈ నైపుణ్యమే ఆయన సువార్తిక పని చేస్తున్న కాలంలో ఆయనకు కొంత ఊతనిచ్చింది (అపొ. 18:1-5).

## ఆయన యొక్క హింసాకాండలు

పౌలు యూదా మతము పట్ల ఎంతటి మిగుల ఆసక్తిగలవాడయ్యాడంటే

సంఘమును క్రూరంగా హింసించే అంతగా. ఆయన క్రీస్తును ఒక మోసగానిగా చూశాడు. సాధారణమైన యూదుడు రాబోయే మెస్సీయను ఒక "సైనిక నాయకుని"గా పరిగణించేవాడు. వారు అనుకున్న నాయకునిలా యేసు ఉన్నట్లయితే, వారు ఆయనను అంగీకరించేవారు (యోహాను 6:15 చూడండి). మెస్సీయను గూర్చి వారు ముందుగానే కలిగియున్న ఆలోచనలకు అనుగుణ్యంగా యేసు లేనందున, వారు ఆయనను తిరస్కరించి ఆయనను అంగీకరించిన ప్రతివానిని యూదా మతమును పరిత్యజిస్తున్నవానిగా పరిగణించారు. రాబోయే మెస్సీయను గూర్చి వారికున్న వికారమైన ఆలోచన వారు యేసును తిరస్కరించిన మరియు సంఘమును హింసించిన సందర్భములకు నేపథ్యంగా ఉంది. ఈ హింసాకాండలో పౌలు ఒక ప్రధానమైన నాయకుడు.

## ఆయన యొక్క మార్పు

పౌలు యొక్క మార్పు అనునది క్రొత్తనిబంధనలో ఉన్న సంఘటనలలో అత్యంత విశేషమైన సంఘటన. దీనిని గూర్చిన నివేదిక ఒక అపొస్తలుల కార్యములు పుస్తకములోనే మూడు పర్యాయములు ప్రస్తావించబడింది (9:1-19; 22:3-16; 26:9-18). పౌలు తన యొక్క యూదా "పితరుల పారంపర్యాచారముల"ను అనుసరించే విషయంలో, బోధించే విషయంలో, మరియు దానిని కాపాడే విషయంలో పౌలు మిగుల "రోషము"గల వానిగా ఉన్నాడు (గలతీ. 1:11-14). క్రైస్తవులు అనేవారు దేవుని యొక్క పనికి హానికరంగా ఉన్నారని ఆయన నిజంగా నమ్మాడు (అపొ. 23:1), మరియు వారి యొక్క ప్రతి ప్రయత్నములను భంగపరచుటకు ఆయన చాలా కష్టపడ్డాడు. నిజానికి, ప్రభువు ఆయనకు "పరలోకము నుండి ఒక గొప్ప వెలుగును" చూపించి ఆయనను గ్రుడ్డివానిగా చేసినప్పుడు ఆయన క్రైస్తవులను హింసించుటకై దమస్కు అనే పట్టణమునకు పోయే మార్గములో ఉన్నాడు (అపొ. 9:1-9). యేసు అప్పుడు ఆయనతో మాట్లాడి ఆయన చేస్తున్న పని దేవునికి అయిష్టాన్ని కలిగిస్తుందనే సంగతి ఆయన గమనించునట్లు చేశాడు. యేసు పౌలుతో దమస్కు పట్టణము వెళ్లమని మరియు అక్కడ ఆయన ఏమి చేయాలో చెప్పబడతాడు అని చెప్పాడు (అపొ. 22:10).

ఈలోగా, తన సందేశమును అంటే పౌలు బాప్తిస్మము పొందాలనే సత్యముతో కూడిన సందేశమును అననియ పౌలునకు బోధించుటకు దేవుడు ఆయనను పంపాడు (అపొ. 22:16). తన బాప్తిస్మము తరువాత, పౌలు యెరూషలేమునకు వెళ్లాడు, అక్కడకు వెళ్లి అన్యజనులకు సువార్త ప్రకటించవలసినదిగా దేవుడు ఆయనతో చెప్పాడు (అపొ. 22:17-21). కాబట్టి క్రైస్తవ్యమును హింసించినవాడే దానిని ప్రకటించేవారిలో ప్రధానుడయ్యాడు. క్రీస్తు ఆయనను "పట్టుకున్నాడు" అని చెప్తూ పౌలు తన మార్పు అనుభవమును వివరిస్తున్నాడు (ఫిలిప్పీ. 3:12). తనను తాను "అకాలమందు పుట్టినట్టున్న" నాకును అని ప్రస్తావిస్తున్నాడు, ఇది ఆయన మార్పును

గూర్చిన మరొక ప్రస్తావన (1 కొరింథీ. 15:8).

### అపొస్తలునిగా ఆయన యొక్క జీవితము

తన మారుమనస్సు అనుభవము తరువాత పౌలు "అనేక దినములు" దమస్కులోనే ఉండి అపొస్తలునిగా ఆయన జీవితమును అక్కడ ప్రారంభించాడు (అపొ. 9:23). ఆ పట్టణమును విడిచిన తరువాత (అపొ. 9:25), ఆయన అరేబియాకు వెళ్లాడు అక్కడ క్రీస్తు ఆయనకు సువార్తను గూర్చిన మరికొన్ని సంగతులు బయలుపరచాడు (గలతీ. 1:11-17). మూడు సంవత్సరముల తరువాత, ఆయన యెరూషలేముకు వెళ్లి అక్కడ పేతురు మరియు యాకోబులను చూచాడు (గలతీ. 1:18, 19). యెరూషలేము నుండి, ఆయన తార్సునకు (అపొ. 11:25) వెళ్లి బహుశా అక్కడ ఒక సంఘమును స్థాపించాడు (అపొ. 15:23). అప్పుడు, అంతియొకయ సంఘము అనూహ్యంగా వృద్ధి పొందుట వలన బర్నబా సౌలును సంప్రదించి సంఘమును ప్రోత్సహించే పనిలో మరియు తన సువార్త పనిలో పాలిభాగస్తుడు అవ్వులాగున ఆయనను తీసుకొచ్చాడు (అపొ. 11:25). అంతియొకయలో తన కష్టము తరువాత, ఆయన అంతియొకయ నుండి మూడు ప్రాముఖ్యమైన సువార్త ప్రయాణముల నిమిత్తమై బయటకు పంపబడ్డాడు (అపొ. 13:1-21:17). ఆయన పిలుపు యొక్క గుణము మరియు ఆయన చేసే పని యొక్క గుణమును బట్టి, ఆయన "అన్యజనులకు అపొస్తలుని"గా పిలువబడ్డాడు (రోమా. 11:13; అపొ. 9:15; గలతీ. 2:6-9 చూడండి).

## పౌలు మరియు థెస్సలొనీక

పౌలు తన రెండవ సువార్త ప్రయాణములో సుమారు క్రీ.శ. 50-51 సంవత్సరముల మధ్య థెస్సలొనీకకు వెళ్లాడు. థెస్సలొనీక అనేది ఎగువ గ్రీసు దేశంలో ఉంది (16వ పేజీలో ఉన్న "పౌలు యొక్క రెండవ సువార్త ప్రయాణము" అనే పటమును చూడండి). అపొస్తలుల కార్యములు 17:1-9 తన సందర్శనను మరియు తన ప్రకటన వలన వచ్చిన ఫలితాలను నమోదు చేస్తుంది. ఆయన అక్కడ ఉన్న సమాజమందిరములో "మూడు విశ్రాంతి దినములు" బోధించాడని గమనించండి (17:2).

పౌలు యొక్క మూడవ సువార్త ప్రయాణములో, ఎఫెసీలో జరిగిన ఆ అలజడి తరువాత, ఆయన మాసిదోనియాకు తిరిగి వచ్చాడు (అపొ. 20:1, 2). ఈ వాక్యములో థెస్సలొనీక ప్రత్యేకంగా ప్రస్తావించనప్పటికీ, ఆయన ఈ ప్రాంతముల గుండా లేదా ఆ జిల్లాల గుండా వెళ్లి అక్కడి సహోదరులను హెచ్చరించాడని వాక్యము చెప్తుంది. ఖచ్చితంగా, పౌలు ఈ ప్రదేశము గుండా వెళ్లినప్పుడు థెస్సలొనీకయులను కలిసి వారిని ప్రోత్సాహించకుండా మాత్రం వెళ్లి ఉండడని మనం చెప్పగలం.

# థెస్సలొనీక: అప్పుడు మరియు ఇప్పుడు

థెస్సలొనీక పట్టణము క్రీ.పూ. 315లో మాసిదోనియా రాజైన Cassander ద్వారా స్థాపించబడింది, ఈయన ఈ పట్టణమును తన భార్యయైన "థెస్సలొనీక" అనే పేరుగా మార్చాడు.[6] ఇది ప్రసిద్ధిగాంచిన ఎగ్నేషియన్ దారిలో ఉన్నది గనుక, ఇది ఈ పట్టణమునకు సందర్శకులను మరియు దీనిలో మంచి ఓడరేవు ఉండుటవలన వాణిజ్యపరమైన వ్యాపారాన్ని తెచ్చింది గనుక ఈ పట్టణము బాగా వృద్ధి చెందింది.

క్రీ.పూ. 168లో రోమీయులు థెస్సలొనీకను జయించారు. వారు మాసిదోనియాను నాలుగు ప్రాంతాలుగా విభజించారు, మరియు థెస్సలొనీక పట్టణము రెండవ ప్రాంతపు రాజధానిగా చేయబడింది. ఈ పట్టణము క్రమేణ మాసిదోనియా ప్రాంతము అంతటికి ఒక మహానగరంగా అయింది.

పౌలు అక్కడకు వచ్చినప్పుడు, ఇది ఏడుగురు *politarchs* (ఈ పదమును అపొ. 17:6లో "పట్టణపు అధికారులు" అని అనువదించబడింది; NIV) చేత పరిపాలించబడిన స్వతంత్ర పట్టణముగా ఉంది. ఈ మనుష్యులు రోమా దేశాధిపతికి జవాబుదారులుగా ఉన్నారు.

పౌలు ఇక్కడ ఉన్నప్పుడు సుస్పష్టంగా డేరాలు కుట్టుకుంటూ తనను తాను పోషించుకున్నాడు (1 థెస్స. 2:9). ఆ దినములలో డేరాలు కుట్టుటకు మేకల బొచ్చును ఉపయోగించడం "ఆనాటి స్థానిక ఆర్థిక వ్యవస్థలో ప్రాముఖ్యమైన భాగమ"నే వాస్తవముతో పౌలు డేరాలు కుట్టుకోవడం అనే విషయంతో సరిపోయినదిగా ఉంది.

ఆ పట్టణము యొక్క ప్రజలలో కొందరు యూదులు (అపొ. 17:1) ఉండేవారు కాని ముఖ్యంగా అన్యజనులే ఎక్కువ (అపొ. 17:4; 1 థెస్స. 1:9; 2:14 చూడండి). పౌలు థెస్సలొనీకను విడచినప్పుడు ఆ పట్టణపు యూదులు ఆయనను హింసించుటకుగాను ఆయనను బెరయ వరకు అనుసరించారు (అపొ. 17:13, 14). థెస్సలొనీకయలో ఉన్న అన్యులు ప్రధానంగా గ్రీకులు మరియు కొందరు రోమీయులు ఉన్నారు.

ఆధునిక పట్టణము సుమారు 809,457 మంది జనాభాను (2001 జనాభా లెక్కల ప్రకారం) కలిగిన ఒక సుందరమైన ఓడరేవు పట్టణము, దీనికి సలోనిక లేదా థెస్సలొనీకి అని పేరులు. ఇది గ్రీసు దేశములో రెండవ అతిపెద్ద పట్టణము. నేటికి కూడా, దీనిలో బట్టల కర్మాగారాలు, సబ్బుల కర్మాగారాలు, మరియు పొగాకును తయారుచేసే పరిశ్రమలు ఉన్నాయి. ప్రస్తుత జనాభాలో సుమారు 50,000 మంది యూదులు ఉన్నారు వీరి పూర్వీకులు పదహారవ శతాబ్దములో పోర్చుగల్ మరియు స్పెయిన్ దేశాల నుండి వచ్చినవారు.

# రచన యొక్క సందర్భము, సమయము మరియు స్థలము

తన రెండవ ప్రయాణములో థెస్సలొనీకయలో సంఘమును స్థాపించిన తరువాత,

యూదులు పెట్టే హింస వలన పౌలు ఆ స్థలమును అకాలములో విడిచివెళ్లవలసి వచ్చింది (అపొ. 17:1-10). ఆయన అక్కడ కేవలం మూడు లేదా నాలుగు నెలలు మాత్రమే ఉన్నాడు.

వారు ప్రభువులో ఎదుగునట్లు వారికి సహాయము చేయుటకు మరియు మరింత బోధించుటకు మరలా రావాలని అనుకున్నాడు కాని అభ్యంతరపరచబడ్డాడు (2:17, 18). ఒకవేళ ఆయన తిరిగి ప్రకటించుటకు అక్కడకు వచ్చినట్లయితే వ్యక్తిగతంగా కొంత హింసకు గురికావలసివస్తుందనే అపాయము ఆటంకంగా ఉంది. దీనిని బట్టి ఆయన వారిని ప్రేమించలేదని కొందరు అనే అవకాశం ఉండేది. కాబట్టి ఆయన తన రెండవ సువార్త ప్రయాణములో ఉండగనే, ఏథెన్సు నుండి తిమోతిని వారిని దర్శించుటకు పంపాడు (3:1-7).

థెస్సలొనీకయులతో కొంతకాలము ఉండిన తరువాత తిమోతి పౌలును మరలా కొరింథీలో కలిసాడు. ఆయన పౌలుకు తెచ్చిన సమాచారము సాధారణంగా మంచిదిగా ఉంది (1 థెస్స. 3:6, 7). అయినప్పటికీ, యేసు యొక్క రెండవ రాకడను గూర్చి వారికి కొన్ని పొరపాటు ఆలోచనలు ఉన్నట్లుగా పౌలుకు తెలిసింది, కాబట్టే ఆయన కొరింథీ నుండి వారికి 1 థెస్సలొనీక పత్రిక వ్రాసాడు. కొరింథీలో తిమోతి పౌలును కలిసిన వెంటనే ఆయన ఈ పత్రికను వ్రాసినట్లుగా భావించడమైనది.

క్రీ.శ. 50-51 మధ్యకాలంలో ఈ సంఘము స్థాపించబడి ఉన్నట్లయితే, ఈ పత్రిక సుమారు క్రీ.శ. 51లో వ్రాయబడి ఉంటుంది. పౌలు కొరింథీలో కొంత కాలం ఉండటం అనేది 1909లో డెల్ఫీ అనే పట్టణములో కనుగొనబడిన రాతి శిలాఫలకముతో ముడిపెట్టబడి ఉంది. ఈ ఫలకము గాల్లియో అనే వ్యక్తి క్రీ.శ. 52లో కొరింథీ పట్టణమునకు వచ్చినట్లు ఉంది (అపొ. 18:12 చూడండి). ఈ ఆధారముగా, 1 థెస్సలొనీకయులకు పత్రిక క్రీ.శ. 51లో, ఈ సంఘమును పౌలు దర్శించిన ఆరునెలల తరువాత (2:17తో పోల్చి చూడండి) వ్రాసినట్లుగా మనము అంచనా వేయవచ్చు. క్రొత్తనిబంధనలో వ్రాయబడిన పత్రికలలో ముందుగా వ్రాసినట్టి పత్రికలలో ఇది ఒకటి. నిజానికి, క్రీస్తు మరణించిన తరువాత ఇరువది సంవత్సరములలోపే ఇది వ్రాయబడింది.

## ఉద్దేశములు మరియు అంశములు

థెస్సలొనీక సంఘమువారు తమ శ్రమలలో ఆదరణ పొందునట్లును (2:4-3:5), తమ దుర్దశలలో జయముతో ఆనందించునట్లును (3:6-10) మరియు వారిలో ఉన్న కొంత నైతిక ఉదాసీనతను గద్దించుటకును (4:1-8) పౌలు ఈ పత్రికను వ్రాసాడు. కాని, ఈ పత్రికలో ఇవ్వబడిన సమాచారం ప్రకారం చూస్తే, క్రీస్తు యొక్క రెండవ రాకడను గూర్చి వారిలో ఉన్న కొన్ని పొరపాటు ఆలోచనలను సరిచేయుటమే ఈ పత్రికను వ్రాయుటలో పౌలు యొక్క ముఖ్యమైన ఉద్దేశముగా అగుపడుతుంది (4:13-5:11). నిజానికి, 1 మరియు 2వ థెస్సలొనీకయులకు పత్రికలలో ఉన్న పావువంతు భాగము

ఈ అంశమును గూర్చే మాట్లాడుతున్నాయి.

పత్రికలో ప్రస్తావించిన ముఖ్యమైన అంశములు ఏవనగా: ఒకే నిజమైన దేవుడు (1:9) ముగ్గురిలో ఉనికి కలిగి ఉండటం (1:5, 6; 4:8; 5:19), క్రీస్తు యొక్క దైవత్వము (3:11, 12), సిలువ మూలముగా కలిగిన రక్షణ (4:14; 5:9, 10), లేఖనముల యొక్క ప్రేరణ మరియు అధికారము (2:13), క్రీస్తులో విశ్వాసులకున్న ఐక్యత (1:1; 5:5), వ్యక్తిగత శుద్ధతకు సంబంధించి శుద్ధీకరణ (4:3-8), మరియు వస్తుపరంగా ఒకరు తమను తాము నిర్వహించుకొనుటలో బుద్ధి కలిగి ఉండటం (4:11, 12; 5:12-15).

## సంక్షిప్త వర్ణన[8]

I. కృతజ్ఞత మరియు ప్రతివాదన (1—3 అధ్యాయములు)
   A. శుభవచనాలు (1:1)
   B. థెస్సలొనీకయులకు కృతజ్ఞత (1:2-4)
   C. థెస్సలొనీకయులు ఎన్నుకొనబడినవారనే నిశ్చయత (1:5-7)
   D. థెస్సలొనీకయుల మాదిరి యొక్క ప్రభావము (1:8-10)
   E. థెస్సలొనీకయలో తన పరిచర్యను గూర్చి పౌలు చేసిన ప్రతివాదన (2:1-12)
      1. తన పరిచర్య యొక్క విజయము (2:1-8)
      2. తన పరిచ్యర యొక్క యథార్థత (2:9-12)
   F. తన పరిచర్యకును మరియు సందేశమునకును థెస్సలొనీకయుల యొక్క స్పందన (2:13-16)
   G. వారిపట్ల పౌలుకున్న సుదీర్ఘమైన ఆసక్తి (2:17-20)
   H. థెస్సలొనీకయలో తిమోతి యొక్క సేవాపరిచర్య (3:1-5)
   I. తిమోతి తెచ్చిన సమాచారము పట్ల సంతోషము (3:6-10)
   J. పౌలు మరియు అతని జతపనివారల శుభములు మరియు ప్రార్థన (3:11-13)

II. మరింత బోధ మరియు హెచ్చరిక (4; 5 అధ్యాయములు)
   A. పరిశుద్ధ జీవితము జీవించుటకు హెచ్చరిక (4:1-8)
   B. సహోదర ప్రేమ కలిగియుండునట్లు హెచ్చరిక (4:9-12)
   C. క్రీస్తు యొక్క రెండవ రాకడను గూర్చిన బోధ (4:13-18)
   D. క్రీస్తు రెండవ రాకడ యొక్క సమయమును గూర్చిన బోధ (5:1-11)
   E. ప్రయోగాత్మకమైన హెచ్చరికలు (5:12-22)

F. ముగింపు విషయాలు (5:23-28)

# అన్వయము

## నాయకుని అనుసరించడం

ఇతరులకు ఉపయోగకరంగా మరియు సహాయకరంగా ఉండే జీవితాలను మనము ఎలా జీవించగలము? ఈ ప్రశ్నకు జవాబు నిమిత్తమై క్రొత్తనిబంధన పుస్తకములు మనకు రెండు ఆలోచనలను ఇస్తున్నాయి.

మొదటిది, క్రొత్తనిబంధన మనకు దేవుని గూర్చిన ఒక వర్ణనను ఇస్తుంది. దేవుడు యేసును పంపాడు మరియు తన భౌగోళిక జీవితమును గూర్చిన నివేదికను సువార్తలలో పొందుపరచాడు. యేసు దేవుని యొక్క ఖచ్చితమైన మూర్తిమంతమునై యున్నాడు (హెబ్రీ. 1:3). యేసు మత్తయి, మార్కు, లూకా మరియు యోహాను సువార్తలలో బోధించిన దానిని, పలికిన దానిని, మరియు చేసిన దానిని చదివినప్పుడు, దేవుడు ఏమి ఆలోచిస్తాడు, ఏమి చెప్తాడు, మరియు ఏమి చేస్తాడు అనే విషయాలను మనం చూడగలం.

రెండవది, క్రొత్తనిబంధన మనకు దేవుని ప్రజలను గూర్చిన ఒక వర్ణనను కూడా ఇస్తుంది. యేసు యొక్క జీవితము ద్వారా దేవుడు చూపించబడి దేవుని గూర్చి బోధించినప్పుడు ప్రజలు ఎలా స్పందించారో అనే విషయాన్ని అపొస్తలుల కార్యములు పుస్తకము మనకు చూపుతుంది. ప్రజలు తనను వెదకాలని, తనకు స్పందించాలని, మరియు తనకు స్నేహితులు కావాలని దేవుడు ఆశించాడు, మరియు ఇదే దేవుని యొక్క ఆలోచనయై ఉన్నదని సువార్త ప్రకటన చేసేవారు చెప్పారు (అపొ. 17:26, 27 చూడండి). పశ్చాత్తాపము మరియు విధేయతల ద్వారా ఈ స్నేహము ఎలా వాస్తవము కాగలదో అనే విషయాన్ని కూడా వారు బోధించారు (అపొ. 17:30 చూడండి). వివిధ దేశములకు, సంస్కృతులకు, మరియు నమ్మకములకు చెందిన ప్రజలు యేసు యొక్క జీవితముతో వారిని పోల్చి చూసినప్పుడు వారు స్పందించిన విధమును అపొస్తలుల కార్యములు పుస్తకము నమోదు చేస్తుంది. చాలా మంది ప్రజలు తమ జీవితమును మార్చుకొనుటకు తిరస్కరించారు, కాని కొందరు మాత్రము స్నేహమును అందిస్తున్న దేవుని వరమును అందుకొని క్రైస్తవులుగా మారారు. నేడు దేవుడు అందిస్తున్న రక్షణ అనే వరమునకు ఎలా స్పందించాలో అనే విషయాన్ని అపొస్తలుల కార్యములు పుస్తకము చదివితే మనకు తెలుస్తుంది.

దేవుని స్వభావమునకును మరియు తమ సొంత స్వభావమునకును ఉన్న వ్యత్యాసముతో నూతన క్రైస్తవులు కష్టపడుతున్నప్పుడు వారికి సహాయము చేయుటకు క్రొత్తనిబంధన ఉత్తరములు, లేదా పత్రికలు వ్రాయబడ్డాయి. మన సొంత స్వభావమును మరియు సంఘములో ఉన్న ఇతరుల గుణమును కూడా అర్థం

చేసుకొనుటకు ఈ పుస్తకములు మనకు సహాయపడగలవు. క్రైస్తవులుగా వ్యక్తిగతముగాను మరియు సంఘమనబడే దేవుని ప్రజలముగా కూడా మనము ఫలభరితముగా మరియు ప్రభావవంతంగా ఉండునట్లు దేవుడు మన జీవితాలలో ఎలా కార్యము చేయగలడో ఈ పత్రికలు వెల్లడిచేస్తున్నాయి.

థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక గ్రీసు దేశములో ఉత్తరభాగాన ఉన్న మాసిదోనియాలో ఉన్న థెస్సలొనీక (ఇప్పుడు దీనిని సలోనిక అని పిలుస్తారు) అనే పట్టణమునకు వ్రాయబడింది. పౌలు, సిల్వాను (లేదా సీల), మరియు తిమోతి అనువారు ఫిలిప్పీలో ప్రకటించి బెరయ, ఏథెన్స్ మరియు కొరింథీ పట్టణములకు వెళ్లుటకు ముందు ఈ ప్రాంతమునకు వచ్చారు. వారు ప్రకటించిన సందేశమునకు ఈ పట్టణస్థులలో కొందరు సంతోషముగా స్పందించారు, అంటే దీని అర్థము దేవుని సందేశమును అంగీకరించుటకు నిరాకరించిన వారిచే వీరు కొంత ఇబ్బందికి గురయ్యారు అని (అపొ. 17:1-9). ఈ ప్రసంగీకులు ఆ ప్రాంతమును విడచిన తరువాత నూతన క్రైస్తవులకు వ్రాయబడిన రెండు పత్రికలలో థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక మొదటిది. బాల్యంలోనే ఉన్న ఈ క్రైస్తవులు విశ్వాసములో స్థిరులుగా ఉంటూ దేవునితోను మరియు ఒకరితోనొకరును తమ సంబంధములలో ఎదుగునట్లును ఈ పత్రికలు ఉద్దేశించబడి ఉన్నాయి.

బోధకులముగా మరియు ప్రసంగీకులముగా ప్రజలతో మనము చేసే పనిలో, ప్రత్యేకంగా మన తోటి క్రైస్తవులతో చేసే మన పనిలో మనకు సహాయపడుటకుగాను ఈ పుస్తకము మనకు కొన్ని ప్రాముఖ్యమైన పాఠములను నేర్పిస్తుంది. మన ప్రభువైన యేసును వెంబడించే విషయంలో ఒకనికొకడు సహాయపడుతూ మన కుటుంబీకులకు కూడా ఎలా సహాయము చేయగలము?

*యేసును వెంబడించుటలో గతములో సాధించిన పురోగతులు.* ప్రజలకు మనము సహాయపడుటలో మొదటి మార్గము ఏమనగా వారి జీవితాలలో సద్గుణములను గుర్తించి ఈ సద్గుణముల యొక్క విలువను వక్కాణించడం. ప్రజల జీవితాలలో ఉన్న ప్రతివిధమైన మంచి గుణము భవిష్యత్ ఎదుగుదలకు ఒక పునాది కావచ్చు. కొన్నిసార్లు, ప్రజలు ఎదుగుటకు సహాయపడునప్పుడు, వారి జీవితాలలో అప్పటికే యోగ్యమైనవిగా దేవుడు భావించే కొన్ని క్రియలను మరియు తలాంతులను మనము నిర్లక్ష్యము చేస్తాము లేదా వాటిపట్ల తక్కువ శ్రద్ధ చూపుతాము. ఇతరులలో ఉన్న మంచితనమును ఉద్ఘాటించాలని దేవుడు కోరుతున్నాడు.

ఇదే విధానాన్ని థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక రచయిత ప్రయోగించాడు. వారి క్రైస్తవజీవితము యొక్క మొదటి కొన్ని నెలలలో మరియు సంవత్సరములలో ఈ ప్రజలు దేవునితోను మరియు ఒకరినొకరితోనూ ఏర్పరచుకున్న మంచి సంబంధములను గూర్చి ప్రస్తావిస్తూ ఈ పత్రిక మొదలౌతుంది (1:6, 9, 10). పుస్తకములో ఈ ప్రాముఖ్యమైన భాగము మొదటి మూడు అధ్యాయములలో, అంటే పుస్తకములో సగభాగము, ఉంది.

దేవుని వెంబడించుటను గూర్చిన ప్రాముఖ్యతను థెస్సలొనీకయులు గుర్తించి సువార్త అనేది దేవుని యొక్క సందేశము అని భావించి తమ విశ్వాసమునకు స్పందించారు (2:13). యేసు ద్వారా వారు దేవుని వెంబడించే వారిగా అయ్యారు. దేవుని వెంబడించుటకు ఒక మూలము తోటి క్రైస్తవుల జీవితాలను గమనించడం మరియు వారు చూపిస్తున్న మాదిరిలో దైవికమైన భావాలను మరియు క్రియలను అనుసరించడం అని వారు గమనించారు. థెస్సలొనీకయులు ఇతర దైవిక ప్రజల యొక్క మాదిరిని అనుసరిస్తున్నారు (1:6; 2:14), మరియు ఇతర క్రైస్తవులు అనుసరించులాగున వారు కూడా దైవికమైన ఒక మాదిరిని ఉంచుతున్నారు (1:7). ఈ పుస్తకములో ఈ సంఘటనలన్నియు గొప్ప సంతోషముతో ప్రస్తావించబడ్డాయి, తద్వారా ఈ నూతన క్రైస్తవులు తమ గత జీవితాలలో మరియు ప్రస్తుత స్వభావాలలో దైవికమైన విలువ కలిగినవి ఏమి ఉన్నవో వారు గుర్తించగలుగుతారు.

చేసిన మంచిని బట్టి అభినందించడం అనేది ఇతరులతో మంచి సంబంధములను పెంపొందించుటలో మరియు వారి పురోగతిలో వారికి సహాయపడుటలో ఒక నిత్యభాగము. మంచి లక్షణములు నిర్లక్ష్యము చేయబడినప్పుడు, లేదా చిన్నచూపు చూచినప్పుడు, సంబంధములు పాడవుతాయి మరియు ఇతరులు ఎదగాలి అని మనం చేసే ప్రయత్నాలన్నీ ఆటంకపరచబడతాయి.

తమ తల్లిదండ్రుల నుండి కేవలం విమర్శ మాత్రమే వినే పిల్లలు అభినందించబడనివారిగా మరియు ప్రేమింపబడనివారిగా అనుకుంటారు. దీని ఫలితం తల్లిదండ్రులకు/బిడ్డలకు మధ్యనున్న సంబంధాల తెగతెంపులు; తల్లిదండ్రులు ఇచ్చే సలహా ఎక్కువ ప్రభావాన్ని పొందదు. ఇట్లుండగా, బిడ్డలు తమ పట్ల తమ తల్లిదండ్రుల ప్రేమను గూర్చి పునఃనిశ్చయత ఇవ్వబడినప్పుడు మరియు వారి సంక్షేమము పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపినప్పుడు, వారి తల్లిదండ్రులు చేసే సలహాల పట్లను మరియు మాదిరి పట్లను మరింత శ్రద్ధ చూపుతారు. తమ తల్లిదండ్రులు ఇచ్చే సలహాలు ప్రేమించే తమ హృదయ అంతరంగముల నుండి వస్తున్నాయని బిడ్డలకు తెలియాలి. కేవలం ఆజ్ఞలు జారీ చేయుటకు మాత్రమే తమ తల్లిదండ్రులు ఇష్టత చూపుతారు అనడం కంటే, తమ తల్లిదండ్రులు తమను ప్రేమిస్తారని వారు నమ్మేటట్లు చేయాలి.

ఇదే విధంగా, పెద్దవారు కూడా ఇతరుల నుండి కేవలం విమర్శ మాత్రమే వింటే, లేదా బోధను అనుసరించి నడిచే వారి జీవితాలలో వారిచ్చే ఆజ్ఞలు ఉదాహరించబడకపోతే, అప్పుడు ఇతరులను గూర్చి వారు విమర్శకులుగా మరియు తీర్పరులుగా భావిస్తారు గాని స్నేహితులుగా మరియు సహోదరులుగా మాత్రము కాదు. ప్రజల జీవితాలలో మంచిని గుర్తించునట్లు దేవుని యొక్క వాక్యము మనకు సహాయపడగలదు.

పౌలు ఫిలిప్పీయులకు వ్రాసినప్పుడు, ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో వాటికై వేచి వాటిపై ధ్యానముంచమని సహోదరులకు హెచ్చరించాడు (ఫిలిప్పీ. 4:8).

థెస్సలొనీకయలో ఉన్న క్రైస్తవులకు ఈ పత్రిక ద్వారా తన సొంత బోధను అనుసరించి, వారి జీవితాలలో ఈ లక్షణములు ఉండుటను బట్టి వీటిని ప్రస్తావించి వారిని అభినందించాడు.

*యేసును వెంబడించుటలో భవిష్యత్ పురోగతి.* ప్రజలకు సహాయపడుటలో రెండవ విధానము క్రీస్తులో భవిష్యత్ పురోగమనము యొక్క విలువను గూర్చి ఉద్ఘాటించడం. ఈ లోకము కొరకైన తన ప్రణాళికలలో మనలో ప్రతిఒక్కరిని ఉపయోగించుకోవాలని దేవుడు అనుకుంటున్నాడు. మన జీవితాలను ఆయన నడిపించుటకు మనము ఒప్పుకొనిన యెడల ఆయన మనలను వాడుకుంటాడు.

వారికి లభించిన మంచి ఆరంభముపై కట్టుకుంటూ క్రైస్తవులు పరిపక్వతవైపు ఎదగాలని హెచ్చరిస్తూ థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక వ్రాసినప్పుడు ఇదే ఆలోచనను ఉపయోగించారు. 4వ అధ్యాయము “మెట్టుకు” అనే పదముతో ఆరంభమౌతుంది, అంటే ఇది పత్రిక యొక్క ముగింపు అని కాదు అర్థము, కాని అప్పటికే సాధించబడినదానిపై భవిష్యత్ పురోగమనము ఉంటుందని చెప్తూ రచయిత తన సలహాలను నిర్మిస్తున్నాడు (4:1, 10). ఆఖరు రెండు అధ్యాయములు కూడా క్రొత్త క్రైస్తవులు పరిపక్వత వైపు ఎదుగులాగున సహాయపడుటకు కొన్ని సలహాలను ఇస్తున్నాయి.

మనము మన పాపములను బట్టి పశ్చాత్తాపము పొంది శోధన మరియు తప్పుడు బోధలనుండి వచ్చే అపాయములను గుర్తించాలి. అయినప్పటికీ, క్రైస్తవ పరిపూర్ణత అనునది కేవలం పాపమును గుర్తించి దానిని విసర్జిస్తేనే రాదు. మంచి ప్రజలు పాపమును పరిత్యజించి వారు తమ నాయకుడైన యేసుక్రీస్తును అనుసరిస్తుండగా వారి జీవితాలలో అప్పటికే ఉన్న ఒక మంచి ప్రవర్తనను మరింతగా కట్టుకొనుట ద్వారా సంభవిస్తుంది. వారి గతకాలపు పురోగమనమును గూర్చి ప్రజలను అభినందించిన తరువాత, ఎలా పరిపూర్ణత సాధించుటకు దేవుని వాక్యమును ప్రయోగించమని కూడా మనము వారికి హెచ్చరిక చేయగలుగుతాము.

ప్రతి క్రైస్తవునిలో పురోగమనమునకు కొంత సామర్థ్యత ఉంటుంది. చాలా సందర్భాలలో, ప్రజలు కనీసం ఎదుగుటకు కూడా ప్రయత్నించరు; ఎదగవలసిన అవసరత వారికి లేదని లేదా ఎదగలేమని వారు అంటుంటారు. ఇతరుల పట్ల బోధకులు ఇటువంటి ప్రవర్తనే కలిగియుంటారు. మన విద్యార్థుల పట్ల మనకు ఇటువంటి భావన ఉన్నట్లయితే, పరిపూర్ణత వైపు వారు ఎదుగుటలో మనము బహుశా వారికి సహాయపడలేకపోవచ్చును.

ఫిలిప్పీలో ఉన్న క్రైస్తవులకు పత్రిక వ్రాస్తూ పౌలు “మీలో ఈ సత్క్రియ నారంభించినవాడు యేసుక్రీస్తు దినము వరకు దానిని కొనసాగించునని రూఢిగా నమ్ముచున్నాను” అని అంటాడు (ఫిలిప్పీ. 1:6 - ఫిలే.). ఇదే విధంగా, థెస్సలొనీకయలోని క్రైస్తవుల పురోగతిని బట్టి వారికి కృతజ్ఞతలు తెలుపుతూ వారు “వృద్ధిపొంది,” “అంతకంతకు అభివృద్ధి”ని పొంది, “మరి యెక్కువగా అభివృద్ధి”ని పొంది,

"క్షేమాభివృద్ధి"ని పొందాలని వారిని ప్రోత్సాహించాడు (3:12; 4:1, 10; 5:11). తోటి క్రైస్తవుల సామర్థ్యతలో మనము ఇటువంటి స్థైర్యాన్ని పెంపొందించుకొని వ్యక్తపరచాలి.

మనలో ఉన్న ప్రతిఒక్కరి పట్ల దేవుడు ఒక ప్రణాళికను కలిగి ఉన్నాడు. క్రొత్తనిబంధన పత్రికలే ఈ విషయమునకు రుజువులు. మనమందరమూ వృద్ధి చెందుటకుగాను ఈ పత్రికలు మనకు సహాయపడగలవు. క్రైస్తవ్యంలో వారికున్న మంచి ఆరంభము యొక్క విలువను గూర్చి ఒకసారి మనము ఇతరులకు చూపించినట్లయితే, ఎదుగుటకు అవకాశమున్న కోణాలను గుర్తించునట్లు మనము వారితో కలిసి పనిచేయాలి.

*ముగింపు*. వారి జీవితములలో మనము కొంత పాపమును చూస్తున్నాము గనుక కొంతమంది క్రైస్తవులను మనము నిరీక్షణలేనివారిగా పరిగణిస్తే, వారి జీవితాలలో ఉన్న ఏవైనా మంచి క్రియలను అభినందించకుండా మనము నిర్లక్ష్యము చేస్తే, కేవలము పరిపక్వత లేనివారు మాత్రమే పురోగతి సాధించగలరు అని మనము అనుకుంటే, అప్పుడు మనము థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రికలో ఆచరించిన విధానములను గమనించుట ద్వారా మనకు మనము సహాయపడగలము.

తమ నాయకుడైన యేసును వెంబడించుట ద్వారా థెస్సలొనీకయులు గొప్ప పనిసే చేసారు. మన సంగతి ఏమిటి? ఆయనను వెంబడించడం, ఇతరుల మాటలన్నిటి కంటే ఆయన మాటలను ఎక్కువగా విలువకట్టడం, మనకు దైనందిన మాదిరిగా ఆయనను ఉంచుకోవడం మన ఆలోచనలు ఉన్నాయా? థెస్సలొనీకయులు తమ బోధకులలో యేసు యొక్క ప్రవర్తనల మరియు కార్యముల మాదిరిని చూడగలిగారు. తమ యజమానుని అనుసరించుటలో ఇది వారికి దోహదపడింది. మనము మంచి మాదిరిని వెదకి, వారిని అభినందించి, వారిని గమనించుట ద్వారా వారి వలె జీవించడం నేర్చుకుంటున్నామా? ఇతరులలో మన యజమానుని కార్యములు వెల్లడియగుచుండగా వారిని చూచి ప్రయోగాత్మకంగా మన యజమానుని మనము కూడా వెంబడించులాగున నిశ్చయించుకున్నామా? యేసు చేస్తాడు అనుకొనే ఒక మంచి పనిని మనము చేయకుండా ఇతరులు దానిని చేయుటకు వదిలిపేయుచున్నామా? "నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారము మీరును నన్ను పోలి నడుచుకొనుడి" అని మనము పౌలు వలె చెప్పగలుగుచున్నామా (1 కొరింథీ. 11:1)? మరియు మీరు నావలన ఏవి నేర్చుకొని అంగీకరించితిరో, నాయందున్నట్లుగా ఏవి వింటిరో ఏవి చూచితిరో, అట్టివాటిని చేయుడి; అప్పుడు సమాధాన కర్తయగు దేవుడు మీకు తోడైయుండును" అని ఆయన అన్నాడు (ఫిలిప్పీ. 4:9). దీనిని మనము చెప్పులాగున మనము జీవించుదుము గాక!

మన నాయకుని వెంబడించుట వలన కలుగు ప్రతిఫలము ఏమిటి? ఆయనతో పరలోకములో కూడా మనము ఉండెదము. థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక గుండా పరుగెత్తే ఒక అంశమేదంటే యేసు యొక్క రాకడ. ఇది ప్రతి ఒక్క

అధ్యాయములో ప్రస్తావించబడింది (1:10; 2:19; 3:13; 4:14-17; 5:1-3, 23). యేసు రాకడపై ఇంతటి లోతైన ఉద్ఘాటన ఏదో థెస్సలొనీకయులకు దీనిని గూర్చి తెలియదు అని కాదు, లేదా వారు తమ జీవితములను మార్చుకొనునట్లు భయపెట్టబడాలి అనే ఉద్దేశ్యముతో కాదు. ఈ ఉద్ఘాటనకు గల ప్రధానమైన కారణము వారు తమ జీవితంలో ఒక నిర్మాణాత్మకమైన మరియు పరిపూర్ణతతో కూడిన దృక్పథమును అలవరచుకోవాలనే. వారు యేసువలె ఉండుటకు ఇష్టపడాలి మరియు ఆయనతో కూడా ఉండుటకు ఎదురు చూడాలి.

క్రీస్తునందు తమ జీవితములలో థెస్సలొనీకయులు ఒక గొప్ప ఆరంభమును చేసారు. వారు పరిపూర్ణత చెందు దిశగా వెళ్లవచ్చు. దీనిని ముగింపు తమ ప్రభువు సన్నిధిలో నిత్యత్వమును గడపడమే!

యేసు రాకడను గూర్చిన పునరావృత జ్ఞాపకము నిరీక్షణకు గొప్ప మూలముగా ఉంది. అసంపూర్ణ లోకంలో, క్రైస్తవులు ఎప్పుడు కూడా సంపూర్ణంగా తమ ఇంటిలో ఉన్నవారుగా లేరు. పునరుత్థానుడైన యేసునందు మన విశ్వాసము ఏమంటే ఆయన రాకడ కొరకు మనము ఎదురు చూడగలము, ఆయనతోను మరియు ఆయనను అనుసరించినవారితోనూ తిరిగి ఐక్యపరచబడగలము అనే అంతరార్థమే. ఇది ఇంకను సజీవులముగా నిలిచియున్న వారి విషయంలో ఎంతటి వాస్తవమైనదిగా ఉన్నదో, మరణించినవారి విషయంలో కూడా అంతే వాస్తవం. జీవితపు ముగింపుపై ఉద్ఘాటన ఇట్లుండగా, యేసు తిరిగి వచ్చే లోపే చాలా మంది మరణిస్తున్నప్పటికి కూడా, అయితే మరణము జీవితము యొక్క అంతము కాదు. థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక యొక్క ఉద్ఘాటన ఇప్పుడు ప్రారంభమై యేసు తిరిగివచ్చునప్పుడు ఆయనతో శాశ్వత కాలము ఆనందించే నిత్యజీవితముపైనే ఉంది. ఈ జీవితములోనూ మరియు రాబోయే జీవితములో కూడా మనము మన నాయకుని వెంబడించాలి. మహిమలోనికి ప్రవేశించువరకు యేసును వెంబడించడమే క్రైస్తవులకున్న గొప్ప నిరీక్షణ! TP

---

సూచనలు

[1]Clement of Rome *1 Clement* 38.4. [2]Ignatius *Epistle to the Ephesians* 10.1. [3]Irenaeus *Against Heresies* 5.6.1. [4]F. F. Bruce, *Paul: Apostle of the Heart Set Free* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1977), 43; and Everett Ferguson, *Backgrounds of Early Christianity*, 2d ed. (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co, 1993), 102-3. [5]Ferguson, 103. Tos. Qiddushin 1:11లో యూదా బోధకులు చేసిన వ్యాఖ్యలను కూడా చూడండి. [6]Donald H. Madvig, "Thessalonica," in *The International Standard Bible Encyclopaedia*, ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988), 4:837. [7]Robert L. Thomas, "1 Thessalonians," in *The Expositor's Bible Commentary*, ed. Frank E. Gaebelein (Grand Rapids, Mich.: Zondervan, 1978), 11:230. [8]Raymond C.

Kelcy, *The Letters of Paul to the Thessalonians*, The Living Word Commentary, vol. 13 (Austin, Tex.: R. B. Sweet Co., 1968), 18-19, నుండి సంగ్రహించబడింది.




## పౌలు యొక్క రెండవ మిషనరీ యాత్ర